

# అనగనగా ఓ నాన్న

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**అహమ్మద్** త్రివిక్రంతో చెప్పాడు.

"మీరు చాలా మంచి పని చేస్తున్నారండి. మీరు చాలా మంచివారు."

"నాకన్నా నువ్వే మంచివాడివి. అలెగ్జాండర్ నీకేం కాకపోయినా ఆయనకి సహాయం చేయాలని అనుకున్నావు. నేనీయనకి సహాయం చేయడానికి నాకో స్వార్థ కారణం ఉంది." నిజాయితీగా చెప్పాడు త్రివిక్రం.

తర్వాత మళ్ళీ చెప్పాడు.

"నీకో జీవిత సత్యం చెప్తాను విను. అమెరికాలోని కార్ల వ్యాపారి హెన్రీ ఫోర్డ్ తను తయారు చేసిన మొదటి కారుకి రివర్స్ గేర్‌ని అమర్చడం మర్చిపోయాడు. అంతేకాదు. కారుని నిర్మించిన గదిలోంచి దాన్ని బయటకి తీసుకురావడానికి తగినంత విశాలమైన తలుపు కూడా ఉండాలన్న సంగతి విస్మరించాడు. దాంతో కారు తయారయ్యాక దాన్ని బయటకి తీసుకు రావడానికి గది గోడకి పెద్ద రంధ్రం చేసాడు. అమెరికాలోని గ్రీన్‌ఫీల్డ్ అనే ఆ గ్రామానికి వెళ్తే ఆ చిన్న ఫేక్టరీలోని ఆ రంధ్రాన్ని ఇప్పటికీ చూడచ్చు. తప్పులు చేయని వారంటూ ఈ లోకంలో ఉండరు. కానీ వాటిని సరైన సమయంలో తెలుసుకోవాలి. సరైన విధంగా సవరించుకోవాలి. నువ్వు డాక్టర్ కోర్స్ పూర్తిచేసి డాక్టర్ అయ్యాక ఈ హాస్పిటల్ సూపరింటెండెంట్ చేసేలాంటి తప్పులు మాత్రం చేయక. గవర్నమెంట్ హాస్పిటల్‌లో కొంతకాలం పని చేసాక, గుండెలోని మృదుత్వం పోయి, అది బండగా మారే ప్రమాదం ఉంది. అక్కడి వాతావరణంలో మదర్ థెరీసాని గుర్తుకు తెచ్చుకో. ఆమెని ఆదర్శంగా తీసుకో."

"నిజమే సార్. ఇక్కడ లంచం లేకపోతే మనిషి ఎంత కరకుగా ప్రవర్తించగలడో చూస్తున్నాను. ఇతరులని స్నేహభావంతో చూడటం, పేదవారి మీద దయని చూపించడం ఇక్కడ ఉద్యోగస్థుల్లో ఎవరికీ తెలీదు."

అంబులెన్స్ బయలుదేరాక అలెగ్జాండర్‌తో చెప్పాడు త్రివిక్రం.

"మీరు ఇంకో అయిదారు గంటలు ఓపిక పట్టండి చాలు. హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యాక మీకు చక్కటి చికిత్స మొదలవుతుంది. వారం పదిరోజుల్లో మీరు చాలా తేరుకుంటారు."

"మీరెవరో నాకు చెప్పనే లేదు?" అడిగాడు అలెగ్జాండర్ మళ్ళీ.

"నా పేరు త్రివిక్రం. మీరు మా అమ్మకి పరిచయం."

"మీ అమ్మ పేరు?"

"ప్రమీల."

"ప్రమీలా? నాకా పేరుగల వాళ్ళెవరూ తెలీదు" చెప్పాడు అలెగ్జాండర్.

త్రివిక్రం మౌనంగా ఉండిపోయాడు.

"బహుశా నేను మీరనుకునే మనిషిని కాకపోవచ్చు" కాసేపాగి చెప్పాడు అలెగ్జాండర్.

త్రివిక్రం చిన్నగా నవ్వాడు. అంతే. మళ్ళీ మాట్లాడలేదు అతను.

దారిలో అంబులెన్స్‌ని ఆపించి ఓ హోటల్ నించి టిఫిన్‌ని తెచ్చాడు. పక్కనే ఉన్న ఓ మెడికల్ షాప్‌లో కంపోజ్ మాత్రని కొన్నాడు. ఆకలి మీద ఉన్న అలెగ్జాండర్ దాన్ని ఆవురావురుమంటూ తిన్నాడు. తర్వాత ఆయనకి నొప్పి తెలీకుండా ఉండడానికి ఆ నిద్ర మాత్రని వేసాడు. నిద్రపోతున్న ఆయన వంక చూస్తూ పదే పదే అనుకున్నాడు.

"ఈయన నిజంగా తన తండ్రా? ఇంతటి దయనీయమైన స్థితికి ఎలా చేరుకున్నాడు? ఈయన భార్యా పిల్లలు ఏమయ్యారు?"

దారిలో అంబులెన్స్‌ని జడ్చర్లలో టీ తాగడానికి ఆపాడు డ్రైవర్. త్రివిక్రం కిందకి దిగి రక్త ప్రసరణ కోసం అటూ ఇటూ కొద్దిసేపు నడిచాడు. అయిదు నిమిషాల తర్వాత మళ్ళీ అంబులెన్స్ బయలుదేరింది. త్రివిక్రం డాక్టర్ విరజకి తన సెల్‌నించి ఫోన్ చేసి తను ఓ రోగితో వస్తున్నానని, ఆయన్ని ఇన్‌పేషెంట్‌గా అడ్మిట్ చేసుకోవడానికి ఏర్పాటు చేయమని, అందుకు ఎవరికి ఇవ్వాల్సింది వారికి తను వచ్చాక ఇస్తానని చెప్పమని కోరాడు. అరగంట తర్వాత విరజ ఫోన్ చేసి ఏ వార్డ్‌లోకి చేర్చారు. అంబులెన్స్ డ్రైవర్‌కి మిగిలిన డబ్బుతో పాటు, అదనంగా రెండు వందల రూపాయలు టిప్‌గా ఇచ్చాడు.

అప్పుడు సమయం మధ్యాహ్నం నాలుగుంపావైంది. ఏ ఆపరేటింగ్ థియేటర్ ఖాళీగా ఉందో చెక్ చేసి అలెగ్జాండర్‌ని ఓ దాంట్లోకి తీసుకెళ్ళి ఆయనకి లోకల్ అనస్థీషియా ఇచ్చి అతని రెండు కాళ్ళల్లోని పురుగులని ఓ పరికరంతో బయటకు తీసాడు. కుడి కాల్లోంచి ఇరవై ఏడు, ఎడమ కాల్లోంచి ఇరవై నాలుగు పురుగులని బయటకి తీసి, డిస్ ఇన్‌ఫెక్టెంట్‌తో కాళ్ళని శుభ్రంగా కడిగాడు. అతను చేసేది అలెగ్జాండర్ చూస్తూనే ఉన్నాడు. వార్డ్‌లోకి తీసు కెళ్ళాక మళ్ళీ పురుగులు రాకుండా మందు ఇచ్చాడు. డ్యూటీలో ఉన్న వైద్య సిబ్బందితో చెప్పాడు.

"ఈయన్ని జాగ్రత్తగా చూడండి. మీ మామూలు మీకు అందుతుంది."

వాళ్ళు 'అబ్బే! వద్దండి' అని మాట వరసకి కూడా అనలేదు. 'జాగ్రత్తగా చూసుకుంటాం సార్' అని చెప్పారు.

అలెగ్జాండర్‌కి క్షవర కర్మ చేయించమని ఓ వార్డ్ బాయ్‌కి డబ్బిచ్చాడు.

హాస్పిటల్ నించే సుందరేశ్వర్‌కి ఫోన్ చేసి తను భోజనానికి వస్తున్నానని చెప్పాడు. ఇంటికి తిరిగి వెళ్ళి, వేడినీళ్ళతో స్నానం చేసి బడలిక తీర్చుకునేసరికి డైనింగ్ టేబుల్ మీద భోజనం సిద్ధంగా ఉంది. ఉదయం కూడా భోజనం చేయకపోవటంతో త్రివిక్రంకి బాగా ఆకలిగా ఉంది. భోజనం చేస్తూ ఆ రోజు సంఘటనలన్నీ సుందరేశ్వర్‌కి చెప్పాడు త్రివిక్రం.

"వెరీ గుడ్ అలెగ్జాండరే మీ తండ్రి కావచ్చు." ఉత్సాహంగా చెప్పాడు సుందరేశ్వర్.

"అది రేపు తెలుస్తుంది" చెప్పాడు త్రివిక్రం.

11

ఆ రాత్రి డ్యూటీలోని నర్స్‌కి ఫోన్ చేసి అలెగ్జాండర్ గురించి కనుక్కున్నాడు. ఆయన హాయిగా నిద్రపోతున్నాడని చెప్పిందామె.

మర్నాడు ఉదయం తొమ్మిదిన్నరకి త్రివిక్రం హాస్పిటల్‌కి వెళ్ళాడు. సరాసరి అలెగ్జాండర్ ఉన్న వార్డ్‌లోకి వెళ్ళాడు. ఆయన గడ్డం నున్నగా ఉంది. క్రాఫ్ కూడా ఆకర్షణీయంగా ఉంది. అలెగ్జాండర్‌తో చెప్పింది నర్స్.

"అరుగో! డాక్టర్‌గారు వస్తున్నారు."

అతను తన దగ్గరకి రాగానే అలెగ్జాండర్ తక్షణం త్రివిక్రం చేతిని తన చేతులతో గట్టిగా పట్టుకున్నాడు. ఆయన కళ్ళల్లోంచి నీళ్ళు చిప్పిల్లాయి.

"ఎవరు మీరు? నాకు, మీకు ఏమిటి సంబంధం? మీరెందుకు నన్ను దేవుడిలా ఇలా ఆదుకున్నారు? నా కాళ్ళల్లోని బాధ చాలా భాగం మాయమైంది."

త్రివిక్రం నవ్వి ఆయన పక్కన బెడ్ మీద కూర్చుని ఆయన భుజం మీద చిన్నగా తట్టాడు.

"ప్రమీల గుర్తొచ్చింది. నాకు ఒకే ఒక్క ప్రమీల తెలుసు. మీరు అడిగింది ఏ ప్రమీల గురించి?"

"పబ్లిక్ గార్డెన్స్‌లో మీకు పరిచయమైన ఆ ప్రమీల గురించే."

వెంటనే అలెగ్జాండర్ మొహం పాలిపోయింది. కళ్ళు విప్పార్చి త్రివిక్రం వంక చూసాడు.

"ఆమె మీకు ఎలా తెలుసు? ఏమవుతుంది?" అడిగాడు.

"ఆమె నా తల్లి."

అలెగ్జాండర్ కళ్ళల్లోంచి ఈసారి ధారగా నీళ్ళు కారసాగాయి.

"నన్ను మీరు వెదుక్కుంటూ రావడం వెనక కారణం కొంత నాకు బోధపడింది."

"ప్రమీల నా తల్లి అని, నన్ను పెంపకానికి ఇచ్చేసిందని ఇటీవలే తెలిసింది. ఆమెకి జరిగిన ఆ అన్యాయం గురించి తెలిసాక, మీ నలుగురిలో నా తండ్రి ఎవరు అన్నది తెలుసుకోవాలని అనుకుంటున్నాను. విచారిస్తే మొదటగా మీ వివరాలు తెలిసాయి"

ఆయన చిన్నగా నిట్టూర్చాడు.

"నిజం చెపితే నన్ను నేను సమర్థించుకున్నట్లు అవుతుంది. అది నా తప్పుకాదు. ఆ రాత్రి నేను తాగిన రమ్ ప్రభావం. నిషా లేకపోతే నేనంత దుర్మార్గంగా ప్రవర్తించేవాడిని కాను. ఆ తర్వాత ఎంతకాలం బాధపడ్డానో, ఎన్ని చర్చిల్లో ఎందరు ఫాదర్లకి నేను ఎన్నిసార్లు కన్ఫెస్ చేసానో, పాప పరిహారార్థం ఎన్ని వేల హెయిల్ మేరీలు చదివానో! ఆ పాపం వల్లే నా కాళ్ళకి ఇలా అయిందని నమ్ముతున్నాను." అతని కంఠంలో పశ్చాత్తాపంతో కూడిన బాధని త్రివిక్రం గమనించాడు.

"నేను అర్థం చేసుకోగలను. ప్రతీ మనిషి జీవితంలో బలహీన క్షణాలు ఉంటాయి." ఆయన భుజం మీద 'ఆవేదన పడద్దు' అన్నట్లుగా తడుతూ చెప్పాడు.

"నా మీద నీకు కోపం లేదా?"

"లేదు."

కొద్ది క్షణాలాగి త్రివిక్రం చెప్పాడు.

"మీరే నా తండ్రి అవునో కాదో తెలుసుకునే ప్రయత్నం చేయాలి. అందుకు మీ అనుమతి కావాలి."

ప్రశ్నార్థకంగా చూసాడు అలెగ్జాండర్.

"మీకు డి.ఎన్.ఏ పరీక్ష చేసి, నా జీన్స్, మీవి ఒకటో కాదో తెలుసుకుంటే, మీరు నా తండ్రి అవునో, కాదో శాస్త్రీయంగా తెలిసిపోతుంది."

"ఓ! అలాంటి పరీక్షలు కూడా ఉంటాయా?"

"అవును. దీన్ని కొత్తగా కనిపెట్టారు."

ఆయనతో మాట్లాడుతూనే డిస్పోజబుల్ సిరంజితో ఆయన రక్తాన్ని కొద్దిగా తీసుకుని కొద్దిసేపట్లో వస్తానని చెప్పి లేబ్‌కి వెళ్ళాడు. లేబ్ ఇన్‌ఛార్జ్‌ని తన రక్తాన్ని కూడా తీసుకోమని చెప్పి, ఆ రెంటికీ డి.ఎన్.ఏ పరీక్ష చేయమని, అది వ్యక్తిగత పనికి అవసరమని కోరాడు. ఆ రెండు టెస్ట్‌ల ఫలితాలని పోలిస్తే నిజం తెలుస్తుంది.

లేబ్ ఇన్‌ఛార్జ్ నిస్సిగ్గుగా అందుకు అడిగిన వెయ్యిరూపాయలు త్రివిక్రం ఇచ్చాడు. 'మామూలుగా ఐతే అయిదువేలు తీసుకుంటాను సార్' అతనికి సహాయం చేస్తున్నానన్నట్లుగా చెప్పాడు టెక్నీషియన్.

"రిజల్ట్ ఎప్పుడు ఇస్తావు?" అడిగాడు త్రివిక్రం.

"రేపు సాయంత్రానికి రెడీ అవుతుంది సార్." చెప్పాడు డి.ఎన్.ఏ టెస్ట్ చేసే ఉద్యోగి.

త్రివిక్రం అక్కడ నించి అలెగ్జాండర్ దగ్గరకి వెళ్ళి చెప్పాడు.

"ఇవాళ నా డ్యూటీ ఇంకో చోట. మధ్య మధ్యలో వచ్చి చూస్తూంటాను."

మధ్యాహ్నం ఇంటికి వెళ్ళి సుందరేశ్వర్ హాట్ పేక్‌లో సర్ది ఇంట్లో సిద్ధంగా ఉంచిన భోజనాన్ని త్రివిక్రం తెచ్చి అలెగ్జాండర్‌కి తనే సర్వ్ చేసాడు.

"ఆనాడు నేను చేసిన తప్పుకి నాకు నీనించి ఇలాంటి సహాయం లభించడం ఆశ్చర్యంగా ఉంది. ప్రభువు లీలలని ఎవరు ఊహించగలరు?" చెప్పాడు అలెగ్జాండర్.

ఆయన కళ్ళు మూసుకుని గ్రేస్ బయటకి చెప్పి భోజనం చేసే దాకా మౌనంగా ఉన్నాడు త్రివిక్రం. సుందరేశ్వర్ పెట్టిన టిష్యూ పేపర్‌లతో నోరు, చేతులని తుడుచుకున్నాక అలెగ్జాండర్‌ని అడిగాడు.

"మీ గురించి చెప్పండి. మీకు పెళ్ళయిందా? ఏం ఉద్యోగం చేసేవారు? మీ వాళ్ళు ఎక్కడున్నారు? ఏం చేస్తున్నారు?"

"నీకు మీ అమ్మ రేప్ చేయబడటం దాకా తెలుసు కదా? మిగిలింది పేపర్లలోని వార్తల ద్వారా తెలుసుకున్నావని చెప్పావు కదా?" అడిగాడు అలెగ్జాండర్.

"అవును."

"ఆ తర్వాత నా జీవితంలో జరిగింది చెప్తాను విను."

అలెగ్జాండర్ చెప్పేది జాగ్రత్తగా వినసాగాడు త్రివిక్రం.

12

మర్నాడు ఉదయం హాస్టల్ గదిలోని కురంగేశ్వర్ అలెగ్జాండర్‌ని లేపుతూ చెప్పాడు.

"లే. నిన్న రాత్రి మనం చేసిన ఘోరం గుర్తుందా?"

అప్పటికి అలెగ్జాండర్ నిద్రపోయి కేవలం మూడున్నర గంటలే అయింది. అతనికి పూర్తి మెలుకువ వచ్చి బుద్ధి చురుగ్గా పని చేయలేదు. పక్కకి వత్తిగిలి పడుకున్నాడు. కురంగేశ్వర్ అలెగ్జాండర్‌ని కుదుపుతూ చెప్పాడు.

"లే. మన కోసం కొద్దిసేపట్లో పోలీసులు వస్తారు."

పోలీసులు అన్నమాట విన్నా అలెగ్జాండర్ లేవలేదు. కురంగేశ్వర్ అలెగ్జాండర్‌ని బలవంతంగా లేపి కూర్చోపెట్టి చెప్పాడు.

"నిన్న రాత్రి తాగిన మత్తులో మనం ఓ అమ్మాయిని రేప్ చేసాం. ఇదిగో ఆ వివరాలు పేపర్లో వచ్చాయి. పోలీసులు మనకోసం వెదుకుతున్నారుట."

ఈసారి అలెగ్జాండర్ బుర్ర అతను చెప్పేది రిసీవ్ చేసుకుంది. కానీ దాని ఇంపాక్ట్ అతని మీద పూర్తిగా పడలేదు.

"ఏమిటి నువ్వనేది?" అడిగాడు.

"మనం పారిపోవాలి. తాగి ఎంత ఛండాలమైన పని చేసాం?" కురంగేశ్వర్ బాధగా చెప్పాడు.

రాత్రి పబ్లిక్ గార్డెన్‌లో తాము చేసిన ఘోరం అలెగ్జాండర్‌కి లీలగా గుర్తొచ్చింది.

"పోలీసులు వస్తారన్నావా?" భయంగా అడిగాడు.

"అవును. కొన్ని క్లూలు దొరికాయట. మన కాలేజీ తెరిచాక అక్కడికి వెళ్ళి మన అడ్రస్ కనుక్కుని వస్తారు. ఇంకో రెండు మూడు గంటల్లో రావచ్చు."

"పోలీసులు మనల్ని పట్టుకెళ్తే మాత్రం చావ చితక్కొడతారు." అలెగ్జాండర్ మంచం దిగుతూ భయంగా చెప్పాడు.

అతని తల హేంగోవర్‌తో పగిలిపోతోంది. బాత్ రూంలోకి వెళ్ళి నాలుగైదు నిమిషాల్లో వచ్చి 'పేపరేది?' అని అడిగి తీసుకుని గబగబా మొదటి పేజీలోని ఆ వార్తని చదివాడు. అతనికి అప్పటికి కాని తను ఎంత ప్రమాదకర పరిస్థితిలో పడ్డాడో అర్థం కాలేదు.

"నేను పారిపోతున్నాను. తర్వాత నీ ఇష్టం." భుజాన ఓ సంచీని తొడుక్కుని చెప్పులు వేసుకుంటూ చెప్పాడు కురంగేశ్వర్.

"ఎక్కడికి?"

"ఇంకెక్కడికి? మా ఇంటికి. మా నాన్న దగ్గర డబ్బు తీసుకుని కొంత కాలం ఎటైనా వెళ్తాను."

"నీ దగ్గర డబ్బేమైనా ఉందా?" అలెగ్జాండర్ అతన్ని అడిగాడు.

కురంగేశ్వర్ ఓ వంద ఇచ్చాడు.

"నవనీత్, హరినాథ్ ల సంగతేమిటి?"

"ఇప్పటికే వాళ్ళు కూడా హాస్టల్ వదిలి వెళ్ళిపోయారు. ఈ దినపత్రికని నాకు ఇచ్చింది హరినాథే"

అలెగ్జాండర్ అరగంట తర్వాత సిటీ బస్సులో గౌలికూడా బస్టాండ్‌కి చేరుకున్నాడు. ఇంకా ఆల్కహాల్ తేపులు వస్తూండటంతో దానికి విరుగుడుగా మజ్జిగ తాగి కర్నూలుకి వెళ్ళే బస్సు ఎక్కాడు. అతనికి క్రిమినల్ కేసులో ఇరుక్కున్నాననే బాధ. పైగా హేంగోవర్.

భవిష్యత్తు అంతా అంధకారంగా కనిపించింది. ఇంటికి వెళ్ళి తల్లికి ఏం చెప్పకుండా కొంత డబ్బు తీసుకుని కురంగేశ్వర్‌లా ఎటైనా వెళ్ళిపోవాలన్న ఆలోచన కలిగింది.

ఎక్కడికి వెళ్ళాలి?

కర్నూలు, హైదరాబాద్ తప్ప అతను ఎక్కడికీ వెళ్ళి ఎరగడు. గోవాలోని బసిలికా చర్చిలో ఉన్న, నాలుగు వందల ఏళ్ళయినా పాడవని సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్ పార్థివ దేహం గురించి తన చర్చిలో ఫాదర్ అనేకసార్లు చెప్పగా విని ఉన్నాడు. పదేళ్ళకోసారి దాన్ని భక్తుల సందర్శనార్థం వెండి పేటిక నించి తీసి బయట ఉంచుతారు అని కూడా ఫాదర్ చెప్పాడు. అది చూడాలనే కోరిక అలెగ్జాండర్‌లో ఉంది. గోవాకి వెళ్ళాలని అనుకున్నాడు. గోవా ఎక్కడుందో, ఎలా వెళ్ళాలో కూడా తెలీదు.

బస్సు మధ్యాహ్నం పన్నెండున్నరకి కర్నూలు బస్ స్టాండ్‌లో ఆగింది. బస్సు దిగిన అలెగ్జాండర్ రెండడుగులు వేయగానే ఒకతను అడిగాడు.

"మీరు ఆడిటర్ రామచంద్రరావుగారి అబ్బాయి సూర్యారావు కదా?"

"కాదు"

"మీ పేరు?" వెళ్తూంటే అతన్ని అడిగాడు మళ్ళీ.

"అలెగ్జాండర్" ఆగకుండా చెప్పాడు.

తక్షణం అతను అలెగ్జాండర్ కాలర్ పట్టుకుని 'పద' అన్నాడు. మఫ్టీలోని మరో పోలీస్ కూడా అలెగ్జాండర్ చేతిని పట్టుకున్నాడు. ఆ సంఘటనకి అలెగ్జాండర్ బిత్తరపోయాడు. వాళ్ళు పోలీసులు అని ఇట్టే గ్రహించాడు. అంత త్వరగా పోలీసులు తనని పట్టుకుంటారని అతను ఎదురు చూడలేదు.

నాంపల్లి ఎస్సై ఉదయం తొమ్మిదిన్నరకి వివేక వర్ధని కాలేజీకి వెళ్ళి బస్ పాస్‌లోని వ్యక్తి వివరాలు, హాస్టల్ అడ్రస్ అడిగి తీసుకుని హాస్టల్‌కి వెళ్ళాడు. నలుగురు నిందితులు అప్పటికే మాయమవడంతో వారి ఇళ్ళ చిరునామాలని హాస్టల్ రికార్డుల్లోంచి తీసుకున్నారు. వెంటనే వారి వారి ఊళ్ళల్లోని పోలీసులకి వాళ్ళు అక్కడికి రావచ్చని వారి ఫిజికల్ డిస్క్రిప్షన్‌తో సహా వివరాలని ఫోన్‌లో తెలిపాడు.

కర్నూలు బస్ స్టాండ్, రైల్వే స్టేషన్లలో అలెగ్జాండర్‌ని పట్టుకోవడానికి పోలీసులు మఫ్టీలో కాపున్నారు. అతన్ని అదే రోజు హైదరాబాద్‌కి తరలించారు.

కురంగేశ్వర్‌ని లారీ దిగి ఇంటికి వెళ్తూంటే సిద్దిపేటలో, నవనీత్‌ని సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో పట్టుకున్నారు. హరినాథ్ మూడు రోజుల దాకా దొరకలేదు. చివరికి నాంపల్లి కోర్ట్‌లో లాయర్ సమక్షంలో లొంగిపోయాడు.

క్రిమినల్ కోర్ట్‌లో విచారణ పూర్తవడానికి పంతొమ్మిది నెలలు పట్టింది. నవనీత్, హరినాథ్‌ల మీద నేరాలు ఋజువు కాలేదు. నవనీత్ కథనం ప్రకారం అతను తన పుట్టినరోజుకి పార్టీ ఇచ్చాడు. తర్వాత హరినాథ్, కురంగేశ్వర్, అలెగ్జాండర్‌లతో కలిసి మత్తుదిగాలని వాకింగ్ చేసాడు. ఆ సమయంలో కురంగేశ్వర్ ఓ ఆటోని ఆపాడు. అలెగ్జాండర్ ఆటో డ్రైవర్ని బెదిరించి ప్రమీల చేతిని పట్టుకుని బయటికి లాగాడు. కురంగేశ్వర్, అలెగ్జాండర్లు ఇద్దరూ కలిసి ఆమెని పబ్లిక్ గార్డెన్‌లోని తీసుకెళ్తూంటే, హరినాథ్, నవనీత్‌లు అడ్డుపడ్డారు. ఆ పెనుగులాటలో ఇద్దరికీ ఒంటిమీద గాయాలయ్యాయి. ప్రమీల చేతి గాజులు పగిలి వారికి గుచ్చుకున్నాయి. హరినాథ్ బస్‌పాస్ ఆ పెనుగులాటలో పడిపోయింది.

అలెగ్జాండర్ చెప్పటం ఆపి నవ్వి చెప్పాడు.

"మన వ్యవస్థ పని తీరు, మన సమాజంలోని కుళ్ళు అర్థమయ్యాక నాకు ఎంతో ఆశ్చర్యం కలిగింది. హరినాథ్ తండ్రి రఘునాథ్ ఐ.పి.ఎస్ అధికారి. ఆయన కొడుకు విషయంలో ఐ.ఐ అబ్బాస్ సహాయం చేసాడు. నవనీత్ తండ్రి గోవర్ధన్ ధనవంతుడు. ఆయన ఇచ్చిన లంచంతో అబ్బాస్ నవనీత్‌కి సహాయం చేసాడు. దాంతో నిజాన్ని దాచి ఎఫ్.ఐ.ఆర్ లో అలా నమోదు చేసాడు. కురుంగేశ్వర్ తండ్రి సాంబశివుడు ఓ సాధారణ పచారీ దుకాణం యజమాని. ఏ నెలకి సరిపడే ఆదాయం ఆ నెలకి సంపాదించే సామాన్యుడు. మా అమ్మ మరియమ్మ ఓ సాధారణ ప్రభుత్వోద్యోగిని. హరినాథ్ తండ్రి రఘునాథ్, నవనీత్ తండ్రి గోవర్ధన్ ఒకర్నొకరు సంప్రదించుకున్నారు. ఈ క్రిమినల్ కేసుల విషయంలో అపారమైన అనుభవం గల రఘునాథ్ తమ పిల్లలు ఇద్దరి మీదా నేరం ఋజువు కాకుండా ఉండే విధంగా నేరాన్ని మా ఇద్దరి మీదకి తిప్పి పక్కాగా ఎఫ్.ఐ.ఆర్‌ని తిరగ రాయించాడు. చాలాకాలం మా అమ్మ కూడా మా ఇద్దరిదే తప్పు అని నమ్మింది. నేను అబద్ధం చెప్తున్నాననుకుంది. జైల్లో ఉన్న నేను ఓసారి ప్రమీలని కలిసి నిజం తెలుసుకోమని మా అమ్మతో గట్టిగా చెప్పాను. ఆమెని కలిసి మాట్లాడాక కానీ మా అమ్మకి నిజం తెలీలేదు."

"మీకు ఎంతకాలం జైలు శిక్షపడింది?" అడిగాడు త్రివిక్రం.

అబ్బాస్ ప్రవేశపెట్టిన సాక్షుల్లో ఒకరు పబ్లిక్ గార్డెన్‌లో వాచ్‌మేన్‌గా పనిచేసే అతను. నవనీత్ తండ్రి అతనికి భారీగా డబ్బు ముట్టచెప్పడంతో కోర్టులో నవనీత్, హరినాథ్‌లకి అనువుగా సాక్ష్యం చెప్పాడు. నిజానికి ఆ సమయంలో అక్కడ ఉండాల్సిన వాచ్‌మేన్ ఏమయ్యాడని పత్రికలు ప్రశ్నించాయి. వాచ్‌మేన్, నవనీత్ తండ్రి దగ్గర డబ్బు తిన్న మరో ముగ్గురు సాక్షులు జరిగింది తారుమారు చేసి అలెగ్జాండర్, కురంగేశ్వర్‌లే నేరస్థులుగా చిత్రిస్తూ సాక్ష్యం చెప్పారు. ప్రమీలని కురంగేశ్వర్, అలెగ్జాండర్లు బలత్కారం చేస్తూండగా నవనీత్, హరినాథ్‌లు వాళ్ళని అడ్డుకునే ప్రయత్నం చేసారు అని వారు కోర్టులో సాక్ష్యం చెప్పారు.

ప్రమీల వాళ్ళు నలుగురు తనని ఒకరి తర్వాత మరొకరు బలాత్కరించారని చెప్పినా, అది నిజం కాదని ఆ నలుగురు సాక్షులు చెప్పారు. ఆ మానసిక స్థితిలో, చీకట్లో ప్రమీల జరిగేది సరిగ్గా గ్రహించలేదని, వారిద్దరే మరోసారి రేప్ చేస్తే, అది మిగిలిన వారి పనై ఉంటుందని ఆమె భావించిందని నవనీత్ లాయర్లు వాదించారు. అబ్బాస్ ప్రవేశపెట్టిన ఫొరెన్సిక్ సాక్ష్యంలో కూడా కురంగేశ్వర్, అలెగ్జాండర్‌ల వీర్యం తప్ప ప్రమీల ఒంటిమీద కానీ, దుస్తుల మీద కానీ మిగిలిన ఇద్దరివి లేవని స్పష్టం చేయడంతో వారిమీద కేసు వీగిపోయింది.

నవనీత్ తండ్రి మిత్రుడైన స్థానిక యం.ఎల్.ఏ. పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి అబ్బాస్‌తో మాట్లాడి అతను కోరిన మొత్తంలో సగమే లంచానికి ఒప్పించాడు. నవనీత్‌కి ముందు, తర్వాత హరినాథ్‌కి బెయిల్ మంజూరైంది. మిగిలిన ఇద్దరికీ కోర్టు బెయిల్‌ని నిరాకరించింది. కురంగేశ్వర్, అలెగ్జాండర్లు ఇద్దరినీ నేరస్థులుగా నమ్మి మేజిస్ట్రేట్ ఇద్దరికీ చెరో ఏడేళ్ళు కఠిన కారాగార శిక్షని, చెరో వెయ్యిరూపాయల జరిమానాని, అది కట్టకపోతే మరో ఆర్నెల్ల జైలు శిక్షని విధిస్తూ తీర్పు చెప్పాడు.

మధ్య తరగతి కుటుంబీకులైన వీరిద్దరి కుటుంబ సభ్యులు ఎన్నో అవమానాలకి గురయ్యారు. కురంగేశ్వర్ చేసిన పని ఫలితం అతని కుటుంబం మీద పడింది. సాంబశివుడు తన కొడుకు చేసిన పనికి బాగా కృంగిపోయాడు. కొడుక్కి శిక్ష పడిన రెండురోజులకి అతనికి బి.పి పెరిగి పక్షవాతం వచ్చింది. ఆర్నెల్లకల్లా మానసిక దిగులుతో పోయాడు. అతని చెల్లెళ్ళు ఇద్దరికీ వివాహాలు కాలేదు.

క్రైస్తవ మతంలో ప్రార్థన ద్వార కష్టాలు, సమస్యలు తొలుగుతాయనే విశ్వాసం బలంగా ఉంది. ముఖ్యంగా రోమన్ కేథలిక్స్‌లో. కోర్టులో కేసు నడుస్తున్నంత కాలం అలెగ్జాండర్ తల్లి మరియమ్మ ఆదివారాలు చర్చికి వెళ్ళి తన కొడుక్కి శిక్ష పడకూడదని హెయిల్ మేరీలని చదివేది. రోజూ రాత్రిళ్ళు దైవ ప్రార్థన చేసేది.

కురంగేశ్వర్ కేసుని అతని తరపున హై కోర్టులో అపీల్ చేసేవారే లేకపోయారు. అతని బంధువులలో కొందరికి సానుభూతి ఉన్నా, వారు కూడా నిరుపేదలే. మరియమ్మ ఉద్యోగస్థురాలు కనుక తన కొడుకు చేత హైకోర్టుకి అపీల్ చేయించింది. కేసు నడుస్తున్నంత కాలం ఎప్పటిలా దైవప్రార్థన చేస్తూనే ఉంది.

హైకోర్ట్ జడ్జి ఓ సాంకేతిక కారణంగా అలెగ్జాండర్ నేరం చేయలేదని నమ్మాడు. అతని రక్తంలోని ఆల్కహాల్ శాతాన్ని బట్టి అతను అప్పుడు ఓ స్త్రీని బలాత్కరించే పరిస్థితిలో ఉండటం నమ్మశక్యంగా లేదని, అతన్ని నిర్దోషిగా తీర్పు చెప్పాడు.

కంపెనీ కోసం చాలా కొద్దిగా తాగిన కురంగేశ్వర్ శిక్షని ఖరారు చేసాడు.

"ఆ విధంగా నా జీవితంలో గొప్ప మలుపు తిరిగింది." చిన్నగా నిట్టూర్చి చెప్పాడు అలెగ్జాండర్.

"ఆ తర్వాత మీకు వివాహమైందా? పిల్లలున్నారా? అడిగాడు త్రివిక్రం.

"లేదు. ఆ కేసులో నేను పడ్డ మానసిక వేదనవల్ల నాకు స్త్రీ అంటేనే విరక్తి పుట్టింది. ప్రైవేట్‌గా చదువుని కొనసాగించి పూర్తయిందని అనిపించాను. మా అమ్మ నాకు పెళ్ళి చేయాలని బాగా ప్రయత్నించింది. అయితే ఆమె నా గురించి ఏదీ దాచలేదు. నాలాంటి వాడికి పిల్లని ఎవరిస్తారు? ఆ కేసు నడుస్తూ, నేను రిమాండ్‌లో ఉండగానే నేను నా భవిష్యత్తుని నిర్ణయించుకున్నాను. ఆ ప్రకారమే అది సాగింది."

కొద్ది క్షణాలు నిశ్శబ్దంగా ఉండి, తర్వాత చేత్తో క్రాస్ గుర్తుని అభినయించి చెప్పాడు.

"నా జీవితాన్ని ప్రభువు సేవకి అంకితం చేయాలని నిర్ణయించుకున్నాను. గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక నేను మా చర్చి ఫాదర్‌తో మాట్లాడాను. నా మనసుని బాగా అర్థం చేసుకుంది ఆయన ఒక్కడే నన్ను ఓ సెమినరీలో జాయిన్ చేసాడు. అక్కడ."

"సెమినరీ అంటే?" అడిగాడు త్రివిక్రం.

"సెమినరీ ప్రీస్టులని తయారు చేసే కాలేజీ. అక్కడ తర్ఫీదు పొందితే కానీ ప్రీస్ట్ అయ్యేందుకు వీల్లేదు. క్రిస్టియానిటీలో కూడా చాలా తెగలున్నాయి. కేథలిక్స్, ప్రొటెస్టంట్స్, ప్రెస్బిటేరియన్స్, ఎపిస్కోపిలియన్స్, సెవెంత్ డే ఎడ్వెంట్స్, మెథాడిస్ట్‌లు, బాప్టిస్ట్‌లు, గ్రీస్ ఆరోథ్‌డాక్స్ చర్చి. ఇలా ఎవరికి చెందిన సెమినరీలు వారికి ఉన్నాయి. మా అమ్మ రోమన్ కేథలిక్ కాబట్టి నేను దానికి చెందిన సెమినరీలో చేరాను. అమెరికాకి చెందిన ఆర్ బి సి మినిస్ట్రీస్ అనే ఒక సంస్థ ఆ సెమినరీని నిర్వహిస్తుంది. నిజానికి క్రిస్టియన్స్‌లో రోమన్ కేథలిక్కే ఎక్కువే. వివాహం చేయడం, కన్ఫెషన్స్ వినడం, ఎక్సార్ సిజం చేయడం, బాప్‌టైజ్ చేయడంలాంటి వాటిలో శిక్షణ ఉంటుంది. బైబిల్‌లోని

ముఖ్యవాక్యాలు కంఠతా రావాలి. ఇవేకాక ఆరాధనని కండక్ట్ చేయడం, అకౌంటింగ్‌లో కూడా కోర్స్ ఉంటుంది. నేను కడప జిల్లాలోని ఓ సెమినరీలో శిక్షణలో చేరాను.

"అది పూర్తయ్యాక వారు నన్ను అదిలాబాద్‌లోని తమ చర్చికి ప్రీస్ట్‌గా పంపారు. అలా నా ఇరవై ఏడో ఏట ప్రీస్ట్‌గా నా జీవితాన్ని ప్రారంభించాను. ప్రతీ నిత్యం నేను మీ అమ్మ విషయంలో చేసిన పాపపరిహారార్థం ప్రార్థన చేసేవాడిని. అదిలాబాద్, విజయనగరం, ఖమ్మం, అనంతపూర్, ప్రకాశం, కడప జిల్లాల్లో నేను వివిధ చర్చిల్లో పనిచేసాను. ఆ ప్రభువు సేవ తప్ప నాకు జీవితంలో ఇంకేమీ ఆసక్తిలేదు. ఒకరితో స్నేహం కానీ, శత్రుత్వం కానీ లేదు."

ఆయన చెప్పేది త్రివిక్రం ఆసక్తిగా వింటున్నాడు.

"ఒకవేళ ఆ దుర్ఘటనే జరిగి ఉండకపోతే నేను అందరిలా వివాహం చేసుకుని ఏదో ఉద్యోగం చేస్తూ సాధారణ జీవితాన్ని గడిపి ఉండేవాడిని. అప్పుడు లౌకిక జీవితమే నాకు లభించేది. ఆ దుర్ఘటన నన్ను ఆధ్యాత్మిక జీవితం వైపు నడిపించింది. ఈ ఒక్క విషయంలో నాకు ఆ దుర్ఘటన ఉపకారం చేసిందనే నేను భావిస్తుంటాను."

కొద్ది క్షణాలు మౌనంగా ఉండి మళ్ళీ చెప్పసాగాడు.

"ప్రభువు సువార్తలే నా జీవితాన్ని నడిపించి నాకు మనశ్శాంతిని ఇచ్చాయి. 'బ్లెస్డ్ ఈజ్ ది మేన్ యూ డిసిప్లెయిన్, ఓ లార్డ్, ది మేన్ యూ టీచ్ ఫ్రం యువర్ లా' అని ప్రభువు వాక్యం. అంటే 'ప్రభువు తన చక్రంలో మనల్ని కూర్చోపెట్టి గిర్రున తిప్పుతూంటే ఆయనకి అణిగి ఉండు' అని అర్థం. 'దై వర్డ్ ఈజ్ ఏ లేంప్ టు మై ఫీట్, అండ్ ఏ లైట్ టు మై పాత్' అని ప్రభువు వాక్యం. అది నా జీవితంలో అక్షరాలా అమలైందనే చెప్పాలి. నన్ను మంచి మార్గంలోకి నడిపించడానికే ప్రభువు నా చేత ఆ పాడు పనిచేయించాడని ఇప్పుడు నా పరిపూర్ణ విశ్వాసం. మార్క్‌లో అంటాడు. 'అదర్ సీడ్స్ ఫెల్ ఇన్ టు ది గుడ్ సాయిల్ అండ్ దే గ్రూ అప్ అండ్ ఇంక్రీజ్డ్, దే ఈల్డెడ్ ఏ క్రాప్ అండ ప్రొడ్యూస్డ్ థర్టీ, సిక్స్టీ అండ్ ఏ హండ్రెడ్ ఫోల్డ్' ఎవరైతే దైవ విశ్వాసిగా మనగలడో వారిగే స్వర్గ రాజ్యం లభిస్తుంది అని అర్థం."

ఆయన ఎన్నుకున్న జీవన మార్గంలో ఆయనకైకి ఆత్మ తృప్తి లభించిందని త్రివిక్రం ఆయన మాటల్ని బట్టి గ్రహించాడు.

"మీరు హాస్పిటల్‌లో నేను చూసిన పరిస్థితికి ఎలా వచ్చారు.?"

"ప్రభువు నన్ను ఎందుకు వదిలేసాడనా నీ ప్రశ్న?" నవ్వాడు.

"అదికాదు.."

"ఈవెన్ ది వెరీ హెయిర్స్ ఆఫ్ యువర్ హెడ్ ఆర్ ఆల్ నంబర్డ్" అని మేథ్యూలో ప్రభువు చెప్పాడు. మన తల్లో ఎన్ని వెంట్రుకలు ఉన్నాయో కూడా ఆయనకి తెలుసుట. అంటే మనకి జరిగేది ఏదీ ఆయనకి తెలీకుండా, ఆయన అనుమతి లేకుండా జరగదని అర్థం. దేవుడు ఎన్నడూ మన చిరునామాని పోగొట్టుకోడు. దేవుడు మన హృదయాన్ని పరీక్షిస్తాడు. మన గురించి మొత్తం తెలుసుకుంటాడు. నిజానికి ఈ ప్రపంచాన్ని సృష్టించే ముందే ప్రభువు ఇందులోని జీవులందరినీ మనసులో ఉంచుకున్నాడు. కాబట్టి ఏదో కాకతాళీయంగా మా పల్లె డాక్టర్ ఉన్నాడని. ఆయన కోసం నేనా హాస్పిటల్‌కి రాలేదు. ఆయన పంపితే వచ్చాను. ఆ ప్రభువే ఆ సమయంలో డాక్టర్ భీం శంకర్‌ని కొంతకాలం దూరంగా పంపాడు. తప్పనిసరైన శారీరక బాధని అనుభవించానే తప్ప, ఇలా అయ్యానే అనే మానసిక బాధ ఎన్నడూ నాకు కలగలేదు. నిజానికి ప్రభువు మనకి ఎంత బాధని ఇస్తే, ఆయన మనల్ని అంతగా ప్రేమించినట్లని సెయింట్ థెరిసా మార్టిన్ జీవితం చెప్తోంది. ఫ్రాన్స్‌లోని లైసెక్స్‌లో జీవించిన థెరిసా మార్టిన్ మోనాస్ట్రీలో ఉండగా క్షయ వ్యాధి వచ్చి రక్తం పడుతున్నా ఆ సంగతి ఎవరికీ చెప్పలేదు. 'ప్రభువా! ఇంకాస్త నన్ను ప్రేమించు. ఇంకాస్త బాధనివ్వు' అని నిత్యం ప్రార్థించేది. ఎంతటి భక్తి"

ఆ మాటలు చెప్తూంటే అలెగ్జాండర్ కంఠం డగ్గుత్తికగా మారింది.

"నేను బాగా ఇష్టపడే సెయింట్లలో సెయింట్ థెరిసా మార్టిన్ ప్రథమురాలు. ఆమెని తలచుకోకుండా నాకు రోజు గడవదు. ఆ తల్లి జీవిత చరిత్ర నా దగ్గర చర్చి లైబ్రరీలో ఉంది. వేలాంగిణి ఆ చర్చిని కట్టాక మా క్రిస్టియన్ మత సంస్థని కోరి నన్ను అక్కడికి ప్రీస్ట్‌గా ప్రత్యేకంగా తెప్పించుకుంది. విశ్వాసులు ఆ ప్రాంతంలో చాలామందే ఉన్నారు."

"మీకు ఉన్నంత దైవభక్తి నాకు లేదు." చెప్పాడు త్రివిక్రం.

"అది మనం తెచ్చి పెట్టుకుంటే వచ్చేది మాత్రం కాదు. 'ఏజ్ ది ఫాదర్ హేజ్ లవ్డ్ మీ. సో హేవ్ ఐ లవ్డ్ యూ' అని జాన్‌లో దేవుని వాక్యం. అంటే మనల్ని ఆయన ఎంత ప్రేమిస్తే, మనం ఆయన్ని తిరిగి అందులో కొంత ప్రేమించగలం తప్ప, ఆయనంతగా ఎవరూ ప్రేమించలేరు. ప్రభువుని ప్రేమించే విషయంలో ఎంత ఎక్కువ ప్రేమైనా సరిపోదు అన్నది నాకు అనుభవమైన విషయం."

కొద్దిక్షణాలాగి నవ్వి చెప్పాడు అలెగ్జాండర్.

"నేను బైబిల్‌లోని వాక్యాలు ఎందుకు మాటిమాటికీ చెప్తున్నానా అని హిందువు అయిన నీకు అనిపించవచ్చు. 'యూ విల్ బి ఏ గుడ్ సర్వెంట్ ఆఫ్ క్రైస్ట్ జీసస్, కాన్‌స్టాంట్లీ నరిష్డ్ ఆన్ ది వర్డ్స్ ఆఫ్ ది ఫెయిర్ అండ ఆఫ్ ది సౌండ్ డాక్ట్రైన్' అని టిమోథీలోని వాక్యం. దేవుని వాక్యాల వల్లే ఏ క్రిస్టియన్ కైనా పుష్టి, తుష్టి. కాబట్టి వాటిని తరచు గుర్తు చేసుకుంటూండాలి."

ఆయన కొద్దిసేపు మౌనంగా ఉండిపోయాడు.

"మీకు నొప్పి తగ్గిందా?" అడిగాడు త్రివిక్రం.

"ప్రభువు దయవల్ల బాగా. గాడ్ ఈజ్ గ్రేట్."

"రెండు రోజుల్లో కొన్ని వైద్య పరీక్షలు చేయిస్తాను. అందువల్ల మీ కాళ్ళ జబ్బుకి కారణం తెలుస్తుంది మందులు వాడదాం."

చేతి గడియారం వంక చూసుకుని చెప్పాడు.

"నాకు డ్యూటీకి టైమైంది. వెళ్తాను. డి.ఎన్.ఏ రిపోర్ట్ రేపు సాయంత్రం వస్తుంది. దాన్ని తీసుకుని వస్తాను."

"అలాగే."

"నేను నీ తండ్రిని అయి ఉండచ్చని నీకు అనిపిస్తోందా?" కొద్ది క్షణాలాగి అడిగాడు అలెగ్జాండర్.

"ప్రత్యేకంగా ఏం లేదు. కావచ్చు ఛాన్సెస్ ట్వంటీఫైవ్ పర్సెంట్."

"నాకైతే కాకూడదనిపిస్తోంది."

"ఏం?"

"కాకూడదంతే."

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in